క్లుప్తంగా

క్రీడలతో మానసికోల్లాసం



గార్ల: క్రీడలతో శారీరక ఉల్లాసంతోపాటు మానసికోల్లాసం కలుగుతుందని గార్ల–బయ్యారం సీఐ బి.రవికుమార్ సూచించారు. ఆదివారం మండలంలోని మర్రిగూడెం వేంకటేశ్వరస్వామి మినీ స్టేడియంలో నిర్వహించిన పోలీస్ అండ్ ప్రెస్ క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. బయ్యారం ప్రెస్ టీం, గార్ల బయ్యారం పోలీస్ టీంపై గెలుపొందింది. సీఐ రవికుమార్ కప్ అందజేశారు. కార్యక్రమంలో ఎస్సై జీనత్‌కుమార్, బయ్యారం ఎస్సై తిరుపతి, పోలీసులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్‌గా నవీన్‌కుమార్



మరిపెడ రూరల్: ఎమ్మార్పీఎస్ మండలం కన్వీనర్‌గా మండలంలోని బుర్హాన్‌పురం గ్రామానికి చెందిన గుగ్గిళ్ల నవీన్‌కుమార్ నియామకం అయ్యాడు. తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికి నవీన్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపాడు.

యోగా పోటీల్లో జిల్లా విద్యార్థుల ప్రతిభ



మహబూబాబాద్ అర్బన్: రాష్ట్రస్థాయి జూనియర్ యోగా పోటీలు హైదరాబాద్‌లో నిర్వహించగా జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాల చెందిన సుమారు 10మంది విద్యార్థులు పాల్గొని యోగాసనాలు చేశారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. యోగా పోటీలకు జడ్జిగా మున్సిపల్ పరిధిలోని జమాండ్లపల్లి ప్రభుత్వ పాఠశాల పీఈడీ పుష్పలీల వ్యవహరించారు.

పిడుగుపాటుతో గేదె మృతి

కేసముద్రం: పిడుగుపాటుతో గేదె మృతి చెందిన సంఘటన మండలంలోని కల్వల గ్రామ సమీపంలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని క్యాంపుతండాకు చెందిన ధరంసోత్ రామచంద్రు అనే రైతు, కల్వల గ్రామంలో వ్యవసాయ భూమి వద్ద ఉన్న చెట్ల కింద గేదెలను కట్టేశాడు. ఈక్రమంలో వర్షం కురవడం మొదలు కాగా, ఒక్కసారిగా ఉరిమి పిడుగు చెట్టు వద్ద పడటంతో, ఒక గేదె అక్కడికక్కడే మృతి చెందింది. రైతు భార్య కౌసల్యకు స్పృహతప్పి కిందపడిపోగా, ఆమెను ఆస్పత్రికి తీసుకెళ్లారు. గేదె విలువ రూ.80వేలు ఉంటుందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

సత్ప్రవర్తన కలిగి ఉండాలి



మహబూబాబాద్ రూరల్: రౌడీ షీటర్లుగా పేర్లు నమోదైన వారు సత్ప్రవర్తన కలిగి ఉండాలని మహబూబాబాద్ టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ అన్నారు. రౌడీ షీటర్లకు టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు.

ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



మహబూబాబాద్ రూరల్/నెల్లికుదురు/గూడూరు: ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ జన్మదిన వేడుకలను స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే 60కిలోల కేక్ కట్ చేసి అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, అభిమానులు సంబరాలు జరుపుకొని రక్తదాన శిబిరంలో పాల్గొని 100 యూనిట్ల రక్తందానం చేశారు. ఎమ్మెల్యే మురళీనాయక్, ఉమా దంపతులను శాలువాలు కప్పి, గజమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి, ఘనపురపు అంజయ్య, మిట్టకంటి రాంరెడ్డి, అల్లం నాగేశ్వర్ రావు, చిట్టెం వెంకన్న, సతీష్ పాల్గొన్నారు.

చర్చనీయాంశంగా బర్త్‌డే వేడుకలు

కేసముద్రం: మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్ బర్త్ డే వేడుకలను మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు వేర్వేరుగా రెండు చోట్ల నిర్వహించడం ఆదివారం చర్చనీయాంశంగా మారింది. అంబేడ్కర్ సెంటర్‌లోని వేడుకలకు ఎమ్మెల్యే హాజరై.. పొట్టిశ్రీరాములు సెంటర్‌లోని వేడుకల్లో పాల్గొనకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఇదిలా ఉండగా.. ఇనుగుర్తి మండల కేంద్రంలో నిర్వహించిన బర్త్‌డే వేడుకల్లో చిన్ననాగారం గ్రామానికి చెందిన ఇరువర్గాల నాయకులు పరస్పరం వాగ్వాదానికి దిగారు.

‘మాడ్రా’ అమలయ్యేనా?

- తుమ్మలకుంటలో ప్లాట్లు చేసి అమ్మకాలు
- చెరువులను కాపాడాలని కోరుతున్న ప్రజలు



చెరువులో ప్లాట్లు చేసి పాతిన హద్దురాళ్లు

మహబూబాబాద్ అర్బన్: మానుకోట మున్సిపల్ పరిధిలోని 1వ వార్డు ఈదులపూసపల్లి శివారు తుమ్మలకుంట చెరువును భూ కబ్జాకోరులు రియల్ వ్యాపారం కోసం పూర్తిగా వెంచర్ చేసి ప్లాట్లుగా అమ్మకాలు చేశారు. ప్రస్తుతం అమ్మిన ప్లాట్లు పూర్తిగా ఇప్పుడు నిండిన చెరువులో ఉండటం విశేషం. 50వ సర్వే నంబర్‌లో 20ఎకరాల విస్తీర్ణంతో చెరువు శిఖం, బఫర్ జోన్ కలిసి ఉన్నా అంతా రియల్ వ్యాపారానికి పోను సుమారు 9ఎకరాల విస్తీర్ణం మిగిలింది. ఈ తుమ్మలకుంట చెరువును కబ్జా చేసిన వారిలో అధికార కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకుల పేర్లు వినిపిస్తున్నాయి. హైదరాబాద్ తరహాలో ‘హైడ్రా’ మాదిరిగా మానుకోట పరిధిలో ఈదులపూసపల్లిలో ‘మాడ్రా’ చట్టం అమలవుతుందా లేదా అని పలువురు వార్డు పెద్దలు, యువకులు, విద్యావంతులు వేచి చూస్తున్నారు. ఆదేవిధంగా ఊరి చెరువులను కాపాడాలని వార్డు ప్రజలు కోరుకుంటున్నారు.

ప్లాట్ విలువ రూ.5లక్షలు

తుమ్మలకుంట చెరువు వెంచర్‌ను చేసి అందులో సుమారు 12ప్లాట్లు చేశారు. గజం రూ.5వేల నుంచి రూ.10వేల వరకు అమ్మకాలు చేశారు. మొత్తం 14వందల గజాల్లో ప్లాట్లు చేశారు. సుమారు ఒక ఫ్లాట్ విలువ రూ 5.లక్షల విలువ ఉంటుంది. చెరువులో రియల్ వ్యాపారం చేస్తూ పేద, మధ్య తరగతి ప్రజలను మోసం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని వార్డులోని పలువురు కోరుతున్నారు.

‘రైతుభరోసా’ డబ్బులు ఖాతాల్లో వేయాలి



మాట్లాడుతున్న భాస్కర్

బయ్యారం: వ్యవసాయ సీజన్ మధ్యలోకి వచ్చిన ఇప్పటి వరకు రైతుభరోసా నిధులను ఖాతాల్లో వేయకపోవటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఏఐకెఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొక్కల భాస్కర్ అన్నారు. మండలంలోని గంధంపల్లి–కొత్తపేటలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలకులు మారినా రైతుల జీవితాలు మారడం లేదని, రైతుభరోసా నిధులను వెంటనే రైతుల ఖాతాల్లో వేయాలన్నారు. రైతుకూలీల సమస్యలపై పోరాడుతున్న ఏఐకేఎంఎస్ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఈ జనరల్ కౌన్సిల్‌లో రాష్ట్ర అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి మదార్, నాయకులు ఊక్లా, పొమ్మయ్య, సరళ, బాబు, షర్ఫుద్దీన్, రామచంద్రు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

మరిపెడ రూరల్: మరిపెడ మండలం ఎల్లంపేట జెడ్పీహెచ్‌ఎస్ 1989–90 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరుపుకున్నారు. 34 ఏళ్ల తర్వాత వారు కలుసుకోవడంతో వారి సంతోషాలకు హద్దులు లేకుండా పోయాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పాఠశాల ధ్వంసమైంది. పాఠశాల పునరుద్ధరణకు అదే పాఠశాలకు పూర్వ విద్యార్థులు కొండం సత్యనారాయణ రూ.లక్ష, కొండం రమేష్‌బాబు రూ.20వేలు, బోడ వీరన్న రూ.10వేలు, అజ్మీర భాషా రూ.10వేలు, ఈర్ల వెంకటేశ్వరరావు రూ.10వేలు, విస్సంపల్లి నుంచి రూ.10వేలు పాఠశాలకు విరాళంగా ప్రకటించారు. అనంతరం నాటి గురువులను సన్మానించారు.

రుణమాఫీ అందక రైతుల అవస్థలు



మాట్లాడుతున్న రాజన్న

మహబూబాబాద్ రూరల్: రైతు రుణమాఫీ పూర్తిస్థాయిలో అందరికీ అందలేదని, అనేక కొర్రీలుపెడుతూ తాత్సారం చేస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు, పార్టీ నిర్మాణ బాధ్యులు గునిగంటి రాజన్న అన్నారు. మండలంలోని అమనగల్ సీపీఎంనాయకులు పిడుగు యాదగిరి, గుగులోత్ అనిమి ప్రాంగణంలో ఆదివారం నాగెల్లి సురేష్, గుగులోత్ ఉమేష్ అధ్యక్షతన ఇస్లావత్ జోగ్యనాయక్ జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం జరిగిన పార్టీ మహాసభలో ముఖ్యఅతిథిగా హాజరై రాజన్న మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, తక్షణమే రైతు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభలో సీపీఎం కార్యదర్శి దుడ్డెల రామ్మూర్తి, వెలిశాల సుధాకర్, ఇస్లావత్ శంకర్, గుగులోత్ లచ్చిరాం, ఎండి.షంషీర్ ఆలీ, ఉమేష్, యశోద, సువమ్మ, యేసోబు పాల్గొన్నారు.

నడకతోనే ఆరోగ్యం

మహబూబాబాద్ అర్బన్: నిరంతరం నడకతోనే ఆరోగ్యంగా ఉంటామని కళోజీ వాకర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు డోలి సత్యనారాయణ అన్నారు. మానుకోట మున్సిపల్ పరిధిలోని అనంతారంలో అసోసియేషన్ వార్షిక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు నామిరెడ్డి వెంకట్‌రెడ్డి, ముఖ్య సలహాదారులు మైస నాగయ్య, శ్రీనివాసులు, కోశాధికారి సోమ విష్ణువర్ధన్, సభ్యులు లక్ష్మయ్య, వెంకన్న, మధుసూదన్‌రావు, సతీష్‌రెడ్డి, శ్యామ్‌రావు పాల్గొన్నారు.

పత్తిపాక రోడ్డు పనులు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న సమ్మెట రాజమౌళి

నెహ్రూసెంటర్: జిల్లా కేంద్రంలోని పత్తిపాక రోడ్డు వేయడంలో అధికారులు, పాలకులు ప్రదర్శిస్తున్న అలసత్వం వీడి రోడ్డు పనులు పూర్తి చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సమ్మెట రాజమౌళి అన్నారు. సీపీఎం పత్తిపాకశాఖ మహాసభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలోని నెహ్రూసెంటర్ నుంచి రజాలీపేట వెళ్లేదారిలో రోడ్డు వేసేందుకు ఇళ్లను కూల్చారు తప్పా రోడ్డు వేయలేదని అన్నారు. సంవత్సరాలుగా దాటుతున్న రోడ్డు వేయకుండా ప్రజలను, వాహనదారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి రోడ్డు పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కుమ్మరికుంట్ల నాగన్న, బానోత్ వెంకన్న, అల్లి శ్రీనివాస్‌రెడ్డి, మందుల మహేందర్, నరసింహారావు, అల్వాల ఆనంద్, శక్రు, ప్రభాకర్, యాదగిరి పాల్గొన్నారు.

కార్మికులకు అండగా సీఐటీయూ



మాట్లాడుతున్న భాస్కర్

గార్ల: అసంఘటిత రంగాల కార్మికులకు సీఐటీయూ, సీపీఎం పార్టీలు ఎల్లవేళలా అండగా నిలుస్తాయని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు పాలడుగు భాస్కర్ అన్నారు. ఆదివారం గార్లలో జరిగిన హమాలీ శాఖల మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశంలో ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వ రంగ సంస్థలను, బడా పెట్టుబడిదారులకు అప్పగించి ప్రైవేట్‌పరం చేయడంతో కార్మికులకు ఉద్యోగ భద్రత కరువైందని ఆరోపించారు. ప్రైవేట్ సంస్థల్లో పీఎఫ్, ఈపీఎఫ్ అమలు చేయక పోవడంతో కార్మికుల భవితవ్యం అగమ్యగోచరంగా తయారైందన్నారు. 2029 ఎన్నికల్లో బీజేపీ ఘోర వైఫల్యం చవిచూడటం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు. తొలుత సీపీఎం పార్టీ జెండాను పార్టీ సీనియర్ నాయకులు అంబటి వీరస్వామి ఆవిష్కరించారు. మహాసభలో పార్టీ మండల కార్యదర్శి కందునూరి శ్రీనివాసరావు, జిల్లా నాయకులు కవిత, హరి, పెద్దవెంకటేశ్వర్లు, ఈశ్వర్‌లింగం, మహేశ్వరరావు, నాగమణి, రామకృష్ణ పాల్గొన్నారు.

నేడు వామపక్ష పార్టీల నిరసన

నెహ్రూసెంటర్: సామ్రాజ్యవాద అమెరికా అండదండలతో ఇజ్రాయెల్ చేస్తున్న మారణకాండకు నిరసనగా నేడు జిల్లా కేంద్రంలో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిరసన దినంగా పాటించనున్నట్లు వామపక్ష పార్టీల నేతలు ఆదివారం తెలిపారు. ఏడాది కాలంగా ఇజ్రాయెల్ చేపట్టిన దాడులకు వ్యతిరేకంగా పాలస్తీనాకు సంఘీభావంగా రాష్ట్ర, జిల్లా వ్యాప్తంగా జరిగే నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి, సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి హలావత్ లింగ్యా, గుజ్జు దేవేందర్, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా నాయకులు బిల్లకంటి సూర్యం పిలుపునిచ్చారు.

ఆనందోత్సాహాలతో బతుకమ్మ వేడుకలు



కురవి: బతుకమ్మను ఎత్తుకున్న ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్



గార్ల: వేంకటేశ్వరస్వామి ఆలయంలో..





మానుకోటలో బతుకమ్మలతో చిన్నారులు, మహిళ



దోర్నకల్‌లో..

ఐదవ రోజు ఆదివారం బతుకమ్మ వేడుకలను మహిళలు ఘనంగా జరుపుకున్నారు. బతుకమ్మలను ఒక్క దగ్గర పెట్టి పాటలను పాడుతూ, నృత్యాలు చేస్తూ సంబురాలు చేశారు. అనంతరం బతుకమ్మలను చెరువుల్లో నిమజ్జనం చేశారు. - సాక్షి నెట్‌వర్క్

నాలుగోరోజు అమ్మవారికి పూజలు



మహబూబాబాద్: పూజలు చేస్తున్న మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి



కేసముద్రం: శాకంబరి అలంకరణలో దుర్గామాత

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గాదేవి అమ్మవారు నాల్గో రోజైన ఆదివారం లలితాత్రిపురసుందరి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దుర్గామాతను రకరకాల కూరగాయలతో అలంకరించారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండపాల వద్ద నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. - సాక్షి నెట్‌వర్క్



మహబూబాబాద్ రూరల్: పూజల్లో పాల్గొన్న భక్తులు



దంతాలపల్లి: పూజలో పాల్గొన్న భక్తులు

సంక్షిప్త సమాచారం

సమస్యలపై నిలదీస్తాం..

డోర్నకల్: మున్సిపాలిటీ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పాలకవర్గాన్ని, అధికారులను నిలదీస్తామని సీపీఎం మండల కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో సీపీఎం పార్టీ కార్యదర్శిగా ఎండీ నవాబ్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు బొమ్మన అశోక్‌కుమార్, దాసరి మల్లేశం, నవాబ్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వరికి విస్తరిస్తున్న అగ్గితెగులు

దంతాలపల్లి: మండలంలోని రామవరం, తూర్పుతండా, పెద్దముప్పారం, గ్రామాలతోపాటు పలుగ్రామాల్లో వరి పొలాల్లో అగ్గితెగులు విస్తరిస్తోంది. ఈ తెగులు సోకిన పొలం ఎరుపు రంగుతో ప్రారంభమై మూడు, నాలుగు రోజుల్లో చుట్టుపక్కల ఉన్న పొలాలకు కూడా వ్యాపిస్తోంది. వ్యవసాయ అధికారులు నివారణ చర్యలు చేపట్టి కాపాడాలని రైతులు కోరుతున్నారు.

ద్విచక్రవాహనం చోరీ

దంతాలపల్లి: మండలకేంద్రంలో ఓ ద్విచక్ర వాహనం చోరీకి గురైన సంఘటన శనివారం చోటుచేసుకుంది. ఎస్సై పిల్లల రాజు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వేములపల్లి గ్రామానికి చెందిన గుమడవెల్లి సాలయ్య ఆదివారం మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్‌కు పని నిమిత్తం వెళ్లాడు. బైక్‌ను బ్యాంక్ ఎదురుగా నిలిపి బ్యాంక్‌లోకి వెళ్లాడు. కొద్ది సమయం తర్వాత వచ్చి చూడగా బైక్ కనిపించలేదు. దీంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

నిత్యావసర సరుకుల పంపిణీ

మరిపెడ రూరల్: మండలంలోని గుండెపుడి గ్రామంలోని వరద బాధితులకు మాజీ సర్పంచ్ నూకల కిషన్‌రెడ్డి ఆదివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నూకల కిరణ్‌రెడ్డి, రంజితచిరంజీవి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

యాకమ్మకు సన్మానం

మహబూబాబాద్ అర్బన్: హైదరాబాద్ రవీంద్ర భారతిలో తెలంగాణ భాషా సంస్కృతి శాఖ ఆధ్వర్యంలో ఆదివారం అక్షరయాన్ బతుకమ్మ వ్యాసలు నిర్వహించారు. జిల్లా కేంద్రానికి చెందిన డాక్టర్ తాళ్లపల్లి యాకమ్మ హాజరై ‘బతుకమ్మ పండుగ– స్త్రీల జీవన చిత్రం’ విశిష్టతను వివరించారు. దీంతో యాకమ్మను సన్మానించి పట్టు చీరను అందజేశారు.

పరామర్శ..

మహబూబాబాద్ రూరల్: కురవి మాజీ ఎంపీటీసీ వద్దుల సురేందర్ రెడ్డి తల్లి వద్దుల జయమ్మ అనారోగ్యంతో మృతిచెందగా ఎమ్మెల్యే రామచంద్రునాయక్, మాజీ మంత్రి ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ ఆదివారం ఆమె మృతదేహాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

మహబూబాబాద్ రూరల్: మండలంలోని ఉత్తర తండాలోని ఒకరి ఇంట్లో నిల్వ ఉన్న ఆరు క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుకున్నామని రూరల్ ఎస్సై వి.దీపిక ఆదివారం తెలిపారు. తండాకు చెందిన వాంకుడోత్ కిషన్ పీడీఎస్ బియ్యం కొనుగోలు చేసి ఇంట్లో నిల్వ చేసే సమయంలో పట్టుకున్నామన్నారు. సంగని సతీష్ అనే వ్యక్తికి అమ్ముతానని కిషన్ చెప్పగా ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశామని తెలిపారు.

ఇంటిపై పిడుగు

మహబూబాబాద్ రూరల్: మండలంలోని బలరాంతండా గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం గుగులోత్ లక్ష్మి ఇంటిపై పిడుగుపడింది. దీంతో భయాందోళనకు గురయ్యారు. ఎలాంటి ప్రాణహాని జరుగకపోవటంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

అరెస్ట్ చేయాలి

కురవి: తట్టుపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి నాగలక్ష్మిని వేధించిన వారిని వెంటనే అరెస్టు చేయాలని రాష్ట్ర అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కురవిలోని గుడిసెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి తప్పెట్ల వీరన్న, మండల అధ్యక్షుడు ఇరుగు వెంకన్న, కామ సంజీవరావు మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శిని వేధించిన డీవై గిరిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

నేడు చీరల పంపిణీ

గూడూరు: సద్దుల బతుకమ్మ పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని ఏజెన్సీ గ్రామాల మహిళా సంఘాల సభ్యులకు ఐటీడీఏ నుంచి నేడు చీరలు పంపిణీ చేయనున్నట్లు ఐకేపీ సీసీ కందిక రమేష్, ఎంపీసీ దోసపాటి జ్యోతి ఆదివారం తెలిపారు.

అమరవీరులకు నివాళి

మహబూబాబాద్ రూరల్: అమరవీరులకు ప్రతినెల మొదటి ఆదివారం నివాళులర్పించే కార్యక్రమంలో భాగంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ ఆవరణలో మహాత్మాగాంధీ విగ్రహానికి స్వాతంత్ర్య సమరయోధులు నూకల లింగారెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు.

జీపీ నిధులపై విచారణ చేపట్టాలి



కురవి: మండలంలోని తట్టుపల్లి గ్రామ పంచాయతీకి వచ్చిన నిధులు, జమ, ఖర్చులపై విచారణ చేయాలని ఇండిపెండెంట్ జర్నలిస్టు డీవై గిరి, తట్టుపల్లి గ్రామస్తులు సైదులు మధు, తదితరులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆదివారం తట్టుపల్లి గ్రామంలో వారు మాట్లాడారు. తట్టుపల్లి జీపీకి సంబంధించిన జమ, ఖర్చులపై విచారణ చేయాలని, గ్రామ ఒప్పంద పంచాయతీ కార్యదర్శి విధులపై నిర్లక్ష్యం వహిస్తున్నదని, అక్రమాలపై ఫిర్యాదు చేసిన వ్యక్తులను బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని ఆరోపించారు. గ్రామంలో ఓటర్ జాబితాలో అవకతవకలు జరిగాయన్నారు. ఈ సమావేశంలో శ్రీనివాస్, నరేష్, జానీ, నరేష్, ఉపేందర్ పాల్గొన్నారు.